ఆంధ్రజ్యోతి

సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.4, కనిష్ఠం 27.6
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
మంగళవారం 2 ఏప్రిల్ 2024

జిల్లాలో 83 ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం


• అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 1: జిల్లాలో 83 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు ఉన్న కంట్రోల్ రూమ్ నంబర్ 08468-220051కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో 348 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

కార్పొరేట్ వల!



- ఇంటర్ ప్రవేశాలకు ఫోన్‌కాల్స్
- జిల్లా అంతటా ప్రైవేటు కళాశాల యాజమాన్యాల పోటీ
- రంగంలోకి పీఆర్‌ఓలు
- పది పరీక్ష ఫలితాలు రాకముందే తల్లిదండ్రులతో ఒప్పందాలు
- జోరుగా అడ్మిషన్ల వ్యాపారం



కామారెడ్డి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): "హలో సర్.. మేము కార్పొరేట్ కళాశాల నుంచి.. మీ అమ్మాయి పదో తరగతిలో మంచి మార్కులు సాధిస్తుందని తెలుసుకున్నాం.. మా కళాశాలలో నాణ్యమైన బోధన ఉంటుంది. మంచి ఎలాగూ వస్తాయి కాబట్టి ఫీజులో రాయితీ ఇస్తాం.. ఒక్కసారి మా కాలేజీకి రండి.. అడ్మిషన్ ఫీజు చెల్లిస్తే చాలు" అంటూ ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ కాల్స్ చేస్తూ అడ్మిషన్ల వల విసురుతున్నారు. అందుకు ఏ మాత్రం తగ్గకుండా ప్రైవేట్ కళాశాలలు తమ దగ్గర ఉన్న లేని సౌకర్యాలు, తోక పేర్లను జోడించి తల్లిదండ్రులను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. జిల్లాలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు చేస్తున్న అడ్మిషన్ల ప్రచారం అంతా ఇంతా కాదు. పదో తరగతి విద్యార్థులను చేర్చుకునేందుకు ఇంటర్ కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలు రంగంలోకి దిగాయి. కళాశాలల పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్స్ (పీఆర్‌వోలు)అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులను అయోమయానికి గురిచేస్తున్నారు. ప్రవేశాలకు ముందస్తుగా తల్లిదండ్రులతో ఒప్పందాలు చేయించుకుంటున్నారు. జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ పట్టణాలతోపాటు ఆయా మండలకేంద్రాలు, గ్రామీ ణ ప్రాంతాల్లో ఎన్నికల పచారాన్ని తలపించేలా అడ్మిషన్ల ప్రక్రియను చేపడుతున్నారు. పేరుమోసిన తమ కళాశాలల్లో సీట్లు దొరకవని త్వరపడాలని ప్రచారం చేస్తూ ఆందో ళనకు గురిచేస్తున్నారు. ముందుగా అడ్మిషన్ బుక్ చేసుకుంటే ఫీజు రాయితీ ఉంటుందని మాయమాటలతో నమ్మిస్తున్నారు. ముందుగానే సీటు రిజర్వ్ చేసుకోకపోతే కోరిన బ్రాంచ్‌లో సీటు దొరకదని బెదరకొడుతున్నారు.

పరీక్ష ఫలితాలు రాకముందే..

పదో తరగతి వార్షిక పరీక్షలు గత మూడురోజుల క్రితమే ముగిశాయి. పదో తరగతి పరీక్షలు కొనసాగుతున్న సమయం నుంచే పెద్దఎత్తున అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతూ వస్తోంది. విద్యార్థుల అడ్రస్‌లు, ఫోన్‌నంబర్లు, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యలు, కన్సల్టెన్సీలు, పీఆర్‌వోలకు చేరాయి. అయితే పలు ప్రాంతాల్లో పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు, కళాశాలల అధ్యాపకులు సైతం పీఆర్‌వోలుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నారు. గత ఏడాది రెగ్యులరైజ్ అయిన పలువురు లెక్చరర్‌లు సైతం పీఆర్‌వోలుగా వ్యవహరిస్తూ కమీషన్లు దండుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పరీక్షలు, ఫలితాలతో సంబంధం లేకుండా సీట్ల కోసం ముందస్తు బుకింగ్‌లు జరుపుతున్నారు. ముందుగా బుక్ చేస్తే పీఆర్‌వోలకు కమీషన్లు లభిస్తుండడంతో పీఆర్‌వోలు తల్లిదండ్రులపై ఒత్తిడి పెంచుతున్నారు. ఒక్కో విద్యార్థిపై రూ.5వేల నుంచి రూ.10వేల వరకు కమీషన్‌లు అందుతున్నట్లు తెలుస్తోంది.

ఆఫర్లపై ఆఫర్లు

జిల్లాలో ప్రైవేట్ కళాశాలలు అడ్మిషన్ల కోసం ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నాయి. గత ఏడాది విద్యార్థులు సాధించిన మార్కులు, ప్రస్తుత సంవత్సరంలో విజయ అవకాశాలతో రంగురంగుల బ్రోచర్లను రూపొందించి విద్యార్థులు, తల్లిదండ్రులను ఆకట్టుకునేప్రయత్నాలు చేస్తున్నాయి. ఒక కళాశాలకు దీటుగా మరో కళాశాల భిన్నంగా ఉండేలా ప్రచారం చేస్తున్నాయి. ఉన్నవి, లేనివి చూపిస్తూ అడ్మిషన్ల కోసం ప్రయ త్నిస్తున్నాయి. కళాశాలల్లో పీఆర్‌వోలను ఏర్పాటు చేసుకుని గ్రామాల వారిగా షెడ్యుల్‌తో అడ్మిషన్ల కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి.

అయోమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు

పదో తరగతి పరీక్షలు రాసి మంచి మార్కులు సాధిస్తారనుకుని అంచనాలున్న విద్యార్థుల తలిదండ్రులు ప్రైవేట్ కళాశాలల సిబ్బంది చేసే ఫోన్ కాల్స్‌తో విసుగు చెందుతున్నారు. ఒకవేళ ఫోన్ లిఫ్ట్ చేయకపోతే కార్లు వేసుకుని ఇళ్ల వద్ద వాలిపోతుండడంతో తల్లిదండ్రులు అయోమయానికి గురవుతున్నారు. పేరుకే వేసవి సెలవులు అయినప్పటికీ ప్రైవేట్ విద్యాసంస్థలు అడ్మిషన్ల ప్రక్రియ అడ్డూ అదుపు లేకుండా సాగుతోంది. కళాశాలలో పనిచేస్తున్న సిబ్బందికి టార్గెట్లు ఇచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు వీధుల్లో తిప్పుతున్నారు. ఆయా పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు ఏ ఊరివారో చూసుకుని ఆ ఊరిలో ఉన్న ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల అడ్రస్సు తీసుకుని వారి ఇళ్లకు చేరుతున్నారు.

అప్రమత్తతే ప్రధానం

విద్యార్థుల తల్లిదండ్రులు తొందరపడి పిల్లల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని నిపుణులు సూచిస్తున్నారు. ఒక్కసారి కాలేజీలో చేరితే ఎవరూ పట్టించుకోరని పేర్కొంటున్నారు. కార్పొరేట్ కళాశాలల్లో చేర్పించే ముందు పిల్లల అభిప్రాయాలతోపాటు సదరు కళాశాలల్లో విద్యాబోధన, వసతులు, అనుమతుల గురించి తెలుసుకోవాలని హెచ్చరిస్తున్నారు. తమ విద్యా, వ్యాపారం కోసం నిత్యం పుస్తకమే ప్రపంచంగా మార్చే కళాశాలలు ఉన్నాయని, అలాంటి కళాశాలల్లో చేర్పిస్తే విద్యార్థులు ఒత్తిడికి గురై మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు వస్తాయని సూచిస్తున్నారు. తల్లిదండ్రులు గతంలో ఆయా కళాశాలలో చదువుకున్న వారిని తెలుసుకుని కళాశాలల్లో చేర్పించాలని పేర్కొంటున్నారు.

భానుడు భగ భగ

- జిల్లాలో భగ్గుమంటున్న భానుడు
- గాంధారిలో రికార్డుస్థాయిలో 42.2 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత
- 11 గ్రామాలు ఆరెంజ్ జోన్‌లోకి..
- వేడిమికి అల్లాడుతున్న జిల్లా ప్రజలు
- కర్ఫ్యూను తలపిస్తున్న రోడ్లు




మధ్యాహ్న సమయంలో నిర్మానుష్యంగా కామారెడ్డి పట్టణ రోడ్డు

కామారెడ్డిఅర్బన్, ఏప్రిల్1: జిల్లాలో భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. గత మూడు రోజులుగా చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల పైనే నమోదవుతున్నాయి. సోమవారం గాంధారిలో 42.2డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏప్రిల్‌లో నమోదుకావాల్సిన ఉష్ణోగ్రతల కంటే రెండు డిగ్రీలు అధికంగా నమోదుకావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. మధ్యాహ్నం పల్లె, పట్టణం అనే తేడా లేకుండా రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. వృద్ధులు, పిల్లలు తలడిల్లుతున్నారు. పాఠశాలకు వెళ్లె పిల్లలు మధ్యాహ్నం ఇండ్లకు వచ్చే సమయంలో ఎండ వేడి తట్టుకోలేకపోతున్నారు. యాసంగి పంటల కోతలు కూడా మొదలుకావడంతో రైతులు,కూలీలు ఎండలో ఇబ్బందులు పడుతున్నారు.

• ఆరెంజ్ జోన్‌లోకి 11 గ్రామాలు

దంచికొడుతున్న ఎండలకు జిల్లాలోని 11 గ్రామాలు ఆరేంజ్ జోన్ లోకి వెళ్లాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలలోపు నమోదైయితే సాధారణం. 35నుంచి 40 డిగ్రీలకు చేరుకుంటే జాగ్రత్త వహించాల్సి ఉంటుంది. 41 నుంచి 46 డిగ్రీలకు చేరుకుంటే అప్రమత్తంగా ఉండాల్సినపరిస్థితి. 46 డిగ్రీలకు పైగా నమోదైతే ప్రమాద హెచ్చరికలను వాతావరణ శాఖ జారీచేస్తుంది. జిల్లాలో ఎల్లో జోన్ నుంచి ఆరేంజ్ జోన్‌కు చేరువగా ఉన్న ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

• ప్రారంభం నుంచే తీవ్రత

జిల్లాలో ఈ ఏడాది వేసవి ప్రారంభం నుంచే ఎండలు దంచికొడుతున్నాయి. మార్చి మధ్యలోంచి మొదలైన ఎండల తీవ్రతక్రమంగా పెరుగుతుంది. అకాల వర్షాలు కురిసినా ఎండ తీవ్రతమాత్రం ఏ మాత్రం తగ్గలేదు. ఏప్రిల్ మొదటివారం నుంచే పగటి ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలకుపైగానమోదవుతుండడంతో ప్రజలు మధ్యాహ్నం ఇళ్ల నుంచి బయటికి రావడం లేదు. వృద్ధులు, పిల్లలు వేడి తట్టుకోలేకపోతున్నారు.

• మరింత పెరిగే అవకాశం

వచ్చే నెలలో ఎండల తీవ్రత మరింత పెరుగుతుందనే వాతావరణ శాఖ ధికారులు పేర్కొంటున్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలనిసూచిస్తున్నారు. ఎండకు తోడు వేడిగాలులు వీస్తుండడంతో ఇబ్బంది ఉంటుందని చెబుతున్నారు. వచ్చే నెలలో సగటున 45 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉందని అంచనావేస్తున్నారు.

జిల్లాలో సోమవారం నమోదైన ఉష్ణోగ్రతలు

ప్రాంతం	గరిష్ట	కనిష్ట
గాంధారి	42.2	31.5
బిచ్కుంద	41.8	31.5
డొంగ్లి	47.7	31.0
పల్వంచ	41.7	32.0
పిట్లం	41.6	33.3
కామారెడ్డి	41.4	33.6
జుక్కల్	40.6	33.2
పెద్దకొడప్‌గల్	40.6	33.2
దోమకొండ	40.4	32.3
నస్రూల్లాబాద్	41.2	33.6
దోమకొండ	40.1	32.6
మద్నూర్	40.1	32.6

- అధ్వానంగా పట్టణ ప్రకృతి వనాలు
- లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ప్రకృతివనాల్లో నిర్వహణ కరువు
- పిచ్చిమొక్కలు, పొదలతో నిండిపోవడంతో ప్రజలకు అందని ఆహ్లాదం
- పట్టణంలోని చాలా వార్డుల్లో ఇదే పరిస్థితి



రోగాలకు నెలవుగా ప్రకృతి వనాలు!

కామారెడ్డి అర్బన్, ఏప్రిల్ 1: పట్టణ ప్రజలకు పచ్చదనంతో కూడిన ఆహ్లాదాన్ని అందించాలని ఏర్పాటు చేసిన ప్రకృతివనాలు రోగాలకు నెలవుగా మారాయి. వాతావరణం ప్రజలకు కల్పించాలని ఏర్పాటుచేసిన పట్టణ ప్రకృతివనాలు వృథాగామారుతున్నాయి. లక్షల రూపాయల ప్రజాధానా న్ని వెచ్చించి ఏర్పాటుచేసిన వనాలను పట్టించుకునే వారే కరవయ్యారు. ఖర్చు చేసిన నిధులు వృథా కావడంతోపాటు ప్రజలకు ఆహ్లాదం దూరమ వుతోంది. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో పట్టణ ప్రకృతివనాలను ఏర్పాటుచేసేందుకు ఆగమేఘాలమీద ఆతృత ప్రదర్శించిన ప్రజాప్రతినిధులు, అధికారులు వాటి సంరక్షణను మాత్రం గాలికి వదిలేస్తున్నారు. మున్సిపల్ అధికారులు పట్టణ ప్రకృతివనాలు ఏర్పాటుచేసినప్పుడు చూపిన శ్రద్ధవాటి సంరక్షణపై మాత్రం చూపడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పట్టణంలోని అన్నివార్డులకు చెందిన పట్టణ ప్రకృతివనాలతో పాటు పలు వార్డులలో క్రీడాప్రాంగణాలు పిచ్చిమొక్కలతో నిండిపోయి వాటిని ఏర్పాటుచేసినప్పటి రూపురేఖలు ప్రస్తుత రూపురేఖలకు పొంతన లేకుండాపోయింది. మొత్తం పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిన అసలు అటువైపు కన్నెతి చూసిన నాధుడే కరవయ్యాడని ఆయా ప్రాంతాల వాసులు పేర్కొంటున్నారు.

• హడావుడి అంతా ప్రారంభంలోనే..

ప్రజలకు పచ్చని వాతవరణంతో పాటు ఆహ్లాదాన్ని అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ప్రకృతి వనాలు ఆయా వార్డుల కౌన్సిలర్‌లు, అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల నీరు గారుతోంది. పల్లె ప్రకృతి వనాల మాదిరి పట్టణ ప్రజలకు పట్టణ ప్రకృతి వనాలు ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం ఆలోచన చేసి దాని కార్యరూపం దాల్చేలా చర్యలు చేపట్టింది. దీంతో ప్రారంభంలోనే హడావుడి చేసి మొక్కలను నాటేలా చేసిన అధికారులు పచ్చటి వాతావరణం తీసుకొచ్చి వదిలేశారు. ప్రస్తుతం మున్సిపల్ పరిధిలో ఏర్పాటుచేసిన వార్డులలోని పట్టణ ప్రకృతివనాలను పర్యవేక్షణ చేసి వాటి సంరక్షణకు తగు చర్యలు తీసుకోవాల్సి ఉన్నవాటి వైపు కన్నెతి చూడకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగి అసలు ప్రజలు వినియోగించుకోలేని పరిస్థితిలోకి చేరుతున్నాయి.

• ప్రజలకు అందని ఆహ్లాదం

పట్టణంలోని ఏర్పాటుచేసిన పట్టణ ప్రకృతివనాలు ప్రజలకు ఆహ్లాదాన్ని అందించడం అటుంచితే రోగాలకు నెలవుగా మారుతున్నాయి. కేవలం ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది కాబట్టి ఎక్కడ పడితే ఎక్కడ ఏర్పాటుచేసి వాటిని సంరక్షణ చర్యలు గాలికి వదిలేశారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కొన్ని వార్డులలో మురికి కుంటల వద్ద ప్రకృతి వనాలు ఏర్పాటుచేశారు. దీంతో పాములు, కీటకాలు, దోమలు ఆవాసాలు చేసుకుంటున్నాయి. కనీసం పట్టణ ప్రకృతివనం ఏర్పాటు చేసిన తర్వాతైనా ఆ ప్రాంతాల్లో మురికి కుంటను పూడ్చారా అంటే అదీ లేదు. కొన్ని వార్డులలో స్థలభావంతో ఇతర వార్డులలో పట్టణ ప్రకృతివనాలను ఏర్పాటుచేసిన అధికారులు వాటిని పట్టించుకోవడం లేదు. ప్రకృతివనాలు ఏర్పాటుచేశామా మమ అనిపించేశామా అని మున్సిపల్ అధికారులు ఆలోచన చేస్తున్నారని, అవి ప్రజలకు ఉపయోగపడితే మాకేంటి.. పడకపోతే మాకేంటి అనే ధోరణిలో అధికారులు ఉంటున్నారనే వాదనలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం వీటిపై తగు చర్య తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల చట్టాలు, నిబంధనలపై

అధికారులు అవగాహన కలిగి ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

• కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డిఅర్బన్, ఏప్రిల్1: ఎన్నికల చట్టాలు, నిబంధనలపై ఎన్నికల అధికారులు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణకు కలెక్టర్ హజరై మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు స్వేచ్ఛగా, నిస్పక్షపాతంగా జరిగేలా ప్రిసైడింగ్ అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని తెలిపారు. ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను తమ నియోజకవర్గంలో నుంచి తప్పనిసరిగా పొందాలని సూచించారు. ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటుచేయాలని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అందించేవిధంగా ఫారం 12లను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బంది సమర్పించిన ఆప్షన్‌ల ప్రకారం తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. దీనికి సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో మే 4 నుంచి మే 8 వరకు ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటుచేసి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు స్వీకరిస్తారని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి సంబంధించి వివరాలను 11సీలో పొందుపరచాలని తెలిపారు. ఫారం 12 పోస్టల్ బ్యాలెట్ అందనివారు సంబంధిత వీఆర్‌ఓకు సమాచారం తెలియజేయాలని తెలిపారు. ఉద్యోగి ఓటు ఎక్కడ ఉంటే అక్కడే ఓటు వేసుకుని తమ హక్కును వినియోగించుకోవాలని కోరారు.

రంజాన్ వేళలు

మంగళవారం	బుధవారం
ఇఫ్తార్	సహర్
సా.6.34	ఉ.4.48



తల్లిదండ్రుల పట్ల సాద్భావంతో మెలగండి.. దయార్థహృదయంతో, వినయంతో వారి ముందు తలవంచి ఉండండి

సోషల్ మీడియాలో..

రెచ్చగొట్టే పోస్టులు పెడితే కేసులు

• డీఎస్పీ సత్యనారాయణ

బీర్కూర్, ఏప్రిల్ 1: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాలో కొంతమంది రెచ్చగొట్టే వ్యాఖ్యలతో పోస్టులు పెడుతున్నారని, అలా చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ సత్యనారాయణ హెచ్చరించారు. సోమవారం ఆయన బీర్కూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి మాట్లాడారు. సామాజిక మాధ్యమాల్లో కొందరు రెచ్చగొట్టే వ్యాఖ్యలతో పోస్టులు చేస్తున్నారని, దీంతో గొడవలు జరుగుతున్నాయని అన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గొడవలకు పాల్పడి బైండోవర్ అయిన వ్యక్తులు ఎన్నికల సమయంలో గొడవలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఆరునెలల జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తారని చెప్పారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో రూ.50వేల మించి తరలించవద్దని సూచించారు. నగదుకు సంబంధించిన రశీదులు వెంట ఉంచుకోవాలని చెప్పారు. ఆయన వెంట సీఐ సత్యనారాయణగౌడ్, ఎస్సై రాజశేఖర్ ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ



ధాన్యం కొనుగోలు కేంద్రం వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

యానంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

డిచ్‌పల్లి, ఏప్రిల్ 1: డిచ్‌పల్లి మండలంలోని యానంపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పరిశీలించారు. రైతుల నుంచి ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం అందుబాటులో ఉంచిన సదుపాయాలను, ధాన్యం తీసుకువచ్చిన రైతుల వివరాలను, కొనుగోలు కేంద్రంలో ఉన్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రైతాంగానికి ఎలాంటి సమస్యలు రాకుండా పూర్తిస్థాయిలో కొనుగోలు ప్రక్రియను ప్రారంభించి వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి లారీలో లోడ్ చేసి రైస్‌మిల్లులకు పంపాలన్నారు. మిల్లుల వద్ద ధాన్యం లోడ్ అన్‌లోడ్ జరిగే చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట డీఎస్‌వో చంద్రప్రకాశ్, సివిల్ సప్లై డీఎం జగదీష్, తదితరులు ఉన్నారు.

కలెక్టర్, డీఈవోలను కలిసిన నిజామాబాద్ ట్రస్మా ప్రతినిధులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 1: నూతనంగా ఎన్నికైన ట్రస్మా జిల్లా, నగర కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి జయసింహాగౌడ్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, డీఈవో దుర్గాప్రసాద్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. గత ఏడేళ్లుగా నిరుపయోగంగా ఉన్న ఓల్డ్ ఎన్జీవోస్ కాలనీలోగల ఫిజికల్ హ్యాండిక్యాపుడ్ ట్రైనింగ్ సెంటర్ భవనాన్ని ట్రస్మా నిజామాబాద్ జిల్లా కోసం కేటాయిస్తే.. దాని ద్వారా ప్రైవేటు ఉపాధ్యాయులకు ట్రైనింగ్ సెంటర్ కోసం, పాఠశాల అభివృద్ధి కార్యక్రమాల కోసం వినియోగించుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్‌ను కోరారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కలెక్టర్, డీఈవోలను కలిసిన వారిలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు నిత్యానందం, కార్యదర్శి అరుణ్, కోశాధికారి మధు, గంగారెడ్డి, రమేష్, నగర అధ్యక్షుడు ధర్మరాజు, నగర కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

సిద్ధులగుట్టపై ప్రత్యేక పూజలు

పెర్కిట్, ఏప్రిల్1: పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం శివాలయంలో సిద్ధేశ్వరునికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో భారత్‌గ్యాస్ సుమన్ తిరుమల దంపతులు సిద్ధేశ్వరునికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా నందీశ్వర మహరాజ్ దంపతులకు శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మిట్టపల్లి నిఖిత్‌రెడ్డి సరోజ దంపతులు భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి. సుమన్, పీసీ. గంగారెడ్డి, మల్లయ్య, బోండ్ల ఆనంద్, కొంతం మురళీ, సేవ సమితి సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటారు..సంరక్షణ మరిచారు

● వృథా అయిన ప్రజా ధనం ● పట్టించుకోని ఆర్మూర్ మున్సిపల్ పాలక వర్గం


పట్టణంలో మొక్కలు ఎండిపోయిన దృశ్యం


గతంలో మొక్కల పెంపకానికి గుంతలు తవ్విన దృశ్యం (ఫైల్‌ఫోటో)

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 1:మున్సిపల్ పరిధిలోని ప్రతీ వార్డులో గత నాలుగేళ్లుగా హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటి వాటికి ట్రిగార్డ్స్, కర్ర ఏర్పాటు చేశారు. కానీ వాటిని సంరక్షించే బాధ్యతను ఎవరు పట్టించుకోలేదు. కనీసం అధికారులు పర్యవేక్షించిన సందర్భాలు ఒక్కటి కూడా లేకపోవడం దురదృష్టకరం. మున్సిపల్ పరిధిలోని రెండో వార్డు జిరాయత్‌నగర్ నిజాంసాగర్ కెనాల్ పక్కన ఖాళీ స్థలంలో సుమారు వంద మొక్కలను నాటారు. నాటిన ఐదు నెలల్లో మొక్కలు ఎండిపోగా మరికొన్ని ప్రాంతాల్లోని పార్కులలో ఏర్పాటు చేసిన మొక్కలు ఒక్కటి కూడా లేకపోవడం విడ్డూరం. అధికారులు రికార్డుల్లో నమోదు కొరకు మొక్కలు నాటారే తప్ప వాటిని సంరక్షించడం లేదనే విమర్శలు బాగానే వినిపిస్తున్నాయి. ప్రతీ యేటా మొక్కల కొరకు వాటి సంరక్షణ కోసం లక్షల్లో ప్రజాధనం ఖర్చు చేస్తున్నారు. అయిన ప్రయోజనం లేదు. దీంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.. గడిచిన నాలుగేళ్లలో ఎన్ని మొక్కలు నాటారు. ఎంత బిల్లు లేపారో ఆ భగవంతుడికే తెలుసు. పట్టణ ప్రగతిలో భాగంగా హరితహరం కార్యక్రమం లో ప్రతీవార్డుకు 200 నుంచి 400మొక్కలు మెప్మా ఆర్‌పీలకు అందజేసి ప్రతి ఇంటికి మొక్కలు చేరేలా చూశారు. కానీ వారితోనే వెయ్యి మొక్కలను నాటినట్టు తీర్మానం చే యించారని పలువురు కౌన్సిలర్‌లు విమర్శిస్తున్నారు. ఒక్కో వార్డులో నాలుగింతలు ఎక్కువ రాయించారంటే 36వార్డులను కలిపితే చాలా మొత్తం రికార్డు రాయించారని, పెద్ద మొత్తంలో మొక్కల బిల్లులు లేపారా లేదా లేపే ప్రయ త్నం చేస్తున్నారా తెలియాల్సి ఉంది. ఎన్ని మొక్కలు నాటారు ఎన్ని రికార్డు చేశా రు. ఆ అక్రమార్కులకే తెలుసు. ప్రతిపక్షానికి చెందిన కౌన్సిలర్‌లు హరితహారంలో భాగంగా మొక్కల విషయంలో అవినీతి జరిగిందని బహిరంగంగానే చెబుతూ జిల్లా అధికారులతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. గడిచిన నాలుగేళ్ల కాలంలో మూడు లక్షల మొక్కల పెంపకానికే అటవీ శాఖ అధికారులకు సుమారు రూ.50లక్షల 33వేలు అందినట్టు తెలిసింది. వారి అంచనా ప్రకారం రెండున్నర లక్షల వివిధ రకాల మొక్కలను మున్సిపాలిటీకి అందజేశారు. మొక్కలకు కర్ర, జాలీ ఏర్పాటులో ఎంత బిల్లు లేపారో తెలియాల్సి ఉంది. ఈ మొక్కల సంరక్షణ కొరకు నీటి ట్యాంకర్‌లను ఎంగేజ్ చేసుకొని నెలకు సుమారు రూ.2లక్షల చొప్పున ఖర్చు చేస్తున్నారు. వాటి సంరక్షణ కొరకు లేబర్‌లను సైతం కేటాయించారు. అయిన మొక్కలు భారీ సంఖ్యలో ఎండిపోతున్నాయి. లక్షల్లో ఖర్చు చేసిన ప్రయోజనం లేకపోవడంతో ప్రజలు ప్రజాధానం దుర్వినియోగమైందని విమర్శిస్తున్నారు.



మున్సిపల్ కార్యాలయం ఇదే..

మొక్కలలో జరిగిన అవినీతిని బయటకు తీయాలి



గత పాలకవర్గంలో మున్సిపల్ పరిధిలోని మొక్కలలో జరిగిన అవినీతిని బయటకు తీయాలి. ఎక్కడెక్కడ ఎన్ని మొక్కలు నాటారో వాటికి అయిన ఖర్చు ఎంతో జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టి అవినీతిని వెలికితీయాలని ఆయన డిమాండ్ చేశారు.

- మైలారం బాలు, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ

సిక్కింలోని మంచు పర్వతాన్ని అధిరోహించిన నాళేశ్వర్‌వాసి

● భవిష్యత్‌లో మరిన్ని మంచు పర్వతాలను అధిరోహించడమే లక్ష్యం : మారుతి

నవీపేట, ఏప్రిల్ 1: మండలంలోని నాళేశ్వర్‌కు చెందిన ఆర్మూర్ మారుతి ఇటీవల ఉత్తర సిక్కిం ప్రాంతంలోని మంచు పర్వతాన్ని అధిరోహించి సోమవారం హైదరాబాద్ చేరుకున్నారు. గత సంవత్సరం ఆగస్టు 15న ఆఫ్రికాలో 5,895మీటర్ల ఎత్తులో ఉన్న కిలిమంజారో శిఖరాన్ని అధిరోహించారు. ప్రస్తుతం ఉత్తర సిక్కిం ప్రాంతంలో మైనస్ 15డిగ్రీల సెల్సియస్ వాతావరణంలో ఉన్న ఈ మంచు పర్వతాన్ని ఇప్పటి వరకు ఎవరు అధిరోహించలేదు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 32మంది బృందం సభ్యులు ఈ మంచు పర్వతాన్ని అధిరోహించడానికి గత నెలలో బయల్దేరి వెళ్లారు. ఇందులో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో నుంచి ఆర్మూర్ మారుతీ ఒక్కరే ఉండడం గమనార్హం. ఐహెచ్‌టీఏఈ(ఇండియన్ హిమలయన్ సెంటర్ ఫర్ అడ్వెంచర్ ఎకో టూరిజం)వారి ఆధ్వర్యంలో ఈ పర్వతారోహరణ చేపట్టారు. ఇందులో 12మంది వివిధ కారణాలతో వెనక్కి రాగా 20మంది ఈ మంచు పర్వతాన్ని అధిరోహించి అర్హత సాధించగా అందులో ఆర్మూర్ మారుతీ ఉండడం గర్వకారణం. తాము అధిరోహించిన మంచు పర్వతం చైనా సరిహద్దులో ఉంటుందని అక్కడి నుంచి కేవలం 6కిలో మీటర్ల దూరంలోనే చైనా సరిహద్దు మొదలవుతుందని ఆయన పేర్కొన్నారు. తాము అధిరోహించిన మంచు పర్వతం సుమారు 5200మీటర్ల ఎత్తులో ఉంటోందని వివరించారు. భవిష్యత్‌లో వివిధ దేశాలలో ఉన్న అంతర్జాతీయ స్థాయిలో మంచు పర్వతాలను అధిరోహించడమే తమ లక్ష్య మని ఆయన పేర్కొన్నారు. ఇందులో పలువురు పర్వతారోహణ చేసిన వారికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చేయూతను అందించగా తెలంగాణ రాష్ట్రం నుంచి పర్వతారోహణ చేపట్టిన ఆర్మూర్ మారుతీ తన సొంత ఖర్చుతోనే ఈ పర్వతారోహణ చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్మూర్ మారుతీకి తగిన ప్రోత్సాహం అందించాలని పలువురు కోరుతున్నారు.


త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తున్న ఆర్మూర్ మారుతి

ఏఐపీఎస్‌యూలో చేరికలు

పెద్దబజార్, ఏప్రిల్ 1: ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం నుంచి భారీగా విద్యార్థి సంఘ నాయకులు ఏఐపీఎస్‌యూలో చేరారు. సోమవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి, రాష్ట్ర సహాయ కార్యదర్శి బోడ అనిల్, నగర ఉపాధ్యక్షుడు సందీప్, బోధన్ డివిజన్ కార్యదర్శి సాయికుమార్, సిరికొండ మండల బాధ్యుడు సురేష్‌తో సహ ఇతర మండలాల నాయకులు ఆర్‌ఎస్‌పీ పార్టీ జిల్లా కార్యదర్శి సాయిబాబా ఆధ్వర్యంలో ఏఐపీఎస్‌యూలో చేరారు. వీరికి ఏఐపీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మన్నెకుమార్ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మన్నెకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యావ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడించాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. నూతనంగా సంఘంలో చేరిన వారికి గుర్తింపు ఉంటోందని త్వరలోనే జిల్లా సమావేశాన్ని ఏర్పాటు చేసి నూతన జిల్లా కమిటీని ప్రకటిస్తామన్నారు.



ఏఐపీఎస్‌యూలో చేరుతున్న నాయకులు

బార్ అసోసియేషన్ సభ్యులకు సన్మానం


బార్ అసోసియేషన్ అధ్యక్షుడిని సన్మానిస్తున్న న్యాయాధికారి

ఆర్మూర్‌టౌన్ , ఏప్రిల్1: పట్టణంలోని బార్ అసోసియేషన్ ఆవరణలో సీనియర్ సివిల్ న్యాయాధికారి నసీంసుల్తాన సోమవారం బార్ అసోసియేషన్ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఇటీవల బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన అసోసియేషన్ అధ్య క్షుడు తెడ్డు నర్సయ్య, ఉపాధ్యక్షుడు పోడెటి శంకర్, ప్రధాన కార్యదర్శి దేవరశెట్టి అరుణ్‌కుమార్, కోశాధికారి తుమ్మ సుకేష్, సంయుక్త కార్యదర్శి సిందుకర్ చరణ్, గ్రంథాలయ కార్యదర్శి సూర సురేష్‌లను పట్టుశాలువ, పూలమాలలతో ఆమె ఘనంగా సన్మానించారు. ఎన్నికల అధికారులైన గరడి ఆనంద్, తాళ్ల శ్రీనివాస్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయ వాదులు భూపతిరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, నరేందర్, జగదీష్, ఏలేటి గంగాధర్, సురేష్, కోనేరు, కృష్ణంరాజు, అశోక్, ప్రవీన్, విజయలక్ష్మీ, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఓలంపియాడ్ ఐఐటీలో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన నలంద విద్యార్థులు

పెర్కిట్, ఏప్రిల్1: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో నలంద పాఠశాల విద్యార్థులు 2023-24 విద్యాసంవత్సరం ఈ అబ్యాస్ హైదరాబాద్ వారు నిర్వహించిన ఓలంపియాడ్ ఐఐటీలో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని యాజమాన్యం తెలిపారు. రాష్ట్రస్థాయిలో మొదటి 1, 2, 3ర్యాంకులు సాధించిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్‌లు అభినందనలు తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు హైదరాబాద్‌లోని భారతీయ విద్యా భవన్‌లో ఐఎస్‌ఆర్‌వో శాస్త్రవేత్త సుబ్రమణ్యం చేతుల మీదుగా విద్యార్థులకు షీల్డ్‌లు అందజేశారు.

జవహర్ నవోదయకు ఎంపిక

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 1: మండలకేంద్రంలోని విజ్ఞాన జ్యోతి పాఠశాలకు చెందిన విద్యార్థి పాలెపు లోక్షిత కన్న(నాగాపూర్) నిజాంసాగర్ జవహర్ నవోదయకు ఎంపిక అయినట్లు పాఠశాల కరస్పాండెంట్ గుండోజి దేవేందర్, హెచ్.ఎం సౌమ్య తెలిపారు. ఇటీవల నిర్వహించిన జవహర్ నవోదయ విద్యాలయం 2024-25 విద్యాసంవత్సరంనకు గాను ఆరోతరగతి అర్హతపరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఆదివారం వెలువడిన పరీక్ష ఫలితాల్లో అర్హత సంపాదించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని సోమవారం పాఠశాలలో యాజమాన్య కమిటి శాలువకప్పి, మెమోంటోతో సత్కరించి అభినందించారు. పట్టుదలతో చదివి రాబోవు రోజుల్లో ఇలాటి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు, ఉపనాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాన్వకేషన్ ఫీజు పెంచలేదు

● రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 1: తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఎలాంటి కాన్వకేషన్ ఫీజును విద్యార్థులకు పెంపుచేయలేదని విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు చెందాల్సిన అవసరం లేదని టీయూ రిజిస్ట్రార్ యాదగిరి అన్నారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. పరీక్షల విభాగానికి సంబంధించి అన్ని రకాల ఫీజులు నిబంధనల ప్రకారమే కొనసాగుతున్నాయని అన్నారు.

పడకల్‌లో వెంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ

జక్రాన్‌పల్లి, ఏప్రిల్1: మండలంలోని పడకల్ గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి వేంటేశ్వరస్వామి దేవాలయంలో చోరీ జరిగినట్లు ఎస్సై వెంకట్ కుమార్ తెలిపారు. గుర్తు తెలియని దొంగలు ఆలయంలోని హుండీ తాళాలు పగలకొట్టి నగదును దొంగిలించారని తెలిపారు.సోమవారం పడకల్‌లోని చోరీ జరిగిన అలయాన్నిడిచ్‌పల్లి సీఐ, ఎస్సై పరిశీలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నవీపేట,ఏప్రిల్1: నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జగ్గారావు ఫారం సమీపంలో సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్‌ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. మృతుడికి 55నుంచి 60సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని, అతడు చనిపోయి సుమారు రెండు రోజులు అయి ఉంటోందని భావిస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మల్కాపూర్ పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఈరవత్రి అనిల్‌కు సన్మానం


ఈరవత్రి అనిల్‌ను సన్మానిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

ముప్కాల్, ఏప్రిల్1: తెలంగాణ రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన ఈరవత్రి అనిల్‌ను సోమవారం బాల్కొండ పద్మశాలి సంఘం అధ్యక్షుడు నాగభూషణం, సంఘం సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా బాల్కొండ మండల పద్మశాలీ సంఘ అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. బాల్కొండ నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను పాటుపడుతానని, ప్రజలకు సహాయ సహకారాలు అందజేస్తానని ఈరవత్రి అనిల్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధా న కార్యదర్శి రామనాథం, ఏలిగేటి మధుకర్, కపీల్, రాజేందర్, చిలివేరి లక్ష్మీనారాయణ, పురుషోత్తం, జగదీష్, తదితరులు ఉన్నారు.


ముస్తాబైన మహాలక్ష్మి విగ్రహం

ఘనంగా మహాలక్ష్మి ఆలయంలో పూజలు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 1: డిచ్‌పల్లి మండలంలోని ఘన్‌పూర్ మహాలక్ష్మి ఆలయంలో సోమవారం రేఖాసేనాసేత్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్య లో గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో మామిడిపల్లి వాసి ప్రతిభ

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్1: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లికి చెందిన జెస్సు వెంకట్ వెయిట్ లిఫ్టింగ్‌లో కాంస్య పతకాన్ని సాధించారు. ఇటీవల పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిల్లీ సమీపంలోని నోయిడలో ఆదివారం జరిగిన నేషనల్ వేయిట్ లిఫ్టింగ్ పోటీలలో 90కేజీల విభాగంలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి కాంస్య పతకం సాధించారు. వరల్డ్ పవర్ లిఫ్టింగ్ కాంగ్రెస్ (డబ్ల్యూపీసీ ఇండియా) ఆధ్వర్యంలో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిం చారు. తమ కుమారుడు పవర్ లిఫ్టింగ్‌లో కాంస్య పతకం సాధించడం పట్ల జెస్సు శ్రీనివాస్ స్రవంతి, మామిడిపల్లి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



వెయిట్ లిఫ్టింగ్‌లో కాంస్య పతకం సాధించిన జెస్సు వెంకట్

బదిలీపై వెళ్లిన బోధన్ ఏసీపీకి డాక్టరేట్ ప్రధానం

బోధన్‌రూరల్,ఏప్రిల్1: బోధన్‌లో ఏసీపీగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన కిరణ్ కుమార్ సోమవారం పాండిచ్చేరి డాక్టరేట్ అవార్డు అందుకున్నారు. ఏసీపీ కిరణ్ కుమార్ పలు సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టడంతో ఆయన సేవలను అభినందిస్తూ గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ, డెలావేర్ స్టేట్, యూఎస్‌ఏ సంస్థల ఆధ్వర్యంలో ఏసీపీకి డాక్టరేట్ అందించారు. ఈ సందర్భంగా డాక్టరేట్ అవార్డు అందుకున్న ఏసీపీ కిరణ్ కుమార్‌లను పలువురు అభినందించారు.


డాక్టరేట్ అవార్డు అందుకుంటున్న కిరణ్ కుమార్



దుకాణ సముదాయాలలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

వడ్డీ వ్యాపారుల ఇళ్లు, దుకాణాల్లో సోదాలు

గాంధారి, ఏప్రిల్1: ఎలాంటి అనుమతి లేకుండా వడ్డీ వ్యాపారం చేస్తూ అధిక వడ్డీలు వసూలు చేస్తున్న మండలకేంద్రంలోని కొందరి ఇళ్లు, దుకాణాల్లో సదాశివనగర్ సీఐ సంతోష్ ఆధ్వర్యంలో సోమవారం ఎస్ఐ ఆంజనేయులు తనిఖీలు చేపట్టారు. విలువైన పత్రాలు, ప్రామిసరి నోట్లు, బాండ్లు స్వాధీనం చేసుకున్నారు. మండల కేంద్రంలోని కొంతమంది వ్యాపారులు అధిక వడ్డీకి డబ్బులు ఇచ్చి భూములను కూడా రిజిస్ట్రేషన్‌లు చేసుకున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించామని, అధిక వడ్డీ వసూలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బీఆర్ఎస్ నుంచి రాగుల ప్రభాకర్ సస్పెన్షన్

మాచారెడ్డి, ఏప్రిల్1: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాగుల ప్రభాకర్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు సోమవారం మండల అధ్యక్షుడు పగడాల బాలచంద్రం తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు ప్రభాకర్ పాల్పడుతున్నందున నియోజకవర్గ ఇన్‌చార్జి గంపగోవర్ధన్, జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దిన్ ఆదేశాల మేరకు ఆయనను పార్టీనుంచి సస్పెండ్ చేసినట్లు ఆయన తెలిపారు.

● రాజంపేటలో మరో ఇద్దరు..

రాజంపేట: మండల కేంద్రానికి చెందిన ఇద్దరు బీఆర్ఎస్ కార్యకర్తలు నరేష్, భాస్కర్‌లను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు మండల అధ్యక్షుడు బలవంతరావు తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నందున వీరిద్దరి సభ్యత్వం రద్దు చేసినట్లు తెలిపారు.

రామారెడ్డి ఎంపీపీపై వీగిన అవిశ్వాసం



అవిశ్వాసం విగినట్లు రికార్డులో నమోదు చేస్తున్న ఆర్‌డీవో

రామారెడ్డి, ఏప్రిల్1: రామారెడ్డి మండల పరిషత్ అధ్యక్షుడు నారెడ్డి దశరథ్‌రెడ్డిపై అవిశ్వాసం విగిపోయినట్లు కామారెడ్డి ఆర్‌డీవో రంగనాథరావు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీపై అవిశ్వాస బలపరీక్ష నిర్వహించగా ఎంపీటీసీలు ఎవరు హాజరు కాకపోవడంతో ఎంపీపీపై అవిశ్వాసం విగిపోయింది.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



కాంగ్రెస్‌లో చేరుతున్న గండివేట్ గ్రామస్థులు

గాంధారి, ఏప్రిల్ 1: మండలంలోని గండివేట్ గ్రామానికి చెందిన పలువురు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో చేరినవారిలో బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు సంజీవ్, శ్రీనివాస్, శంకర్, షదుల్, గంగారాం, వెంకన్న, గోపాల్, యూసుబ్ ఉన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు.

● భారీ మెజార్టీయే లక్ష్యంగా పనిచేయాలి

తాడ్వాయి: జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీయే లక్ష్యంగా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని కాళోజీవాడి గ్రామంలో గ్రామకమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జంగం రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా నర్సయ్య, గ్రామయూత్ అధ్యక్షుడిగా రాజేష్, ఉపాధ్యాక్షులుగా రాజు, ప్రధానకార్యదర్శిగా నవీన్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు అఖిల్‌రావు, శ్యామ్‌రావు, వెంకట్‌రాంరెడ్డి, జలంధర్‌రెడ్డి, లక్ష్మన్‌చారి తదితరులు పాల్గొన్నారు.

● కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ బండారి, సంజీవులు, వీడీసీ అధ్యక్షుడు మేకల రాజు, ఎండ్రియాల్ మాజీ ఉపసర్పంచ్ సుధాకర్‌రావులతో పాటు మరికొందరు సోమవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీచేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు తాము ఆకర్షితులమై బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రాంరెడ్డి, శ్యాంరావు, జంగం రాజు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీపై వీగిపోయిన అవిశ్వాసం

● హాజరు కాని సభ్యులు

మద్నూర్, ఏప్రిల్1: మద్నూర్ ఎంపీపీ లక్ష్మీబాయిపై సభ్యులు అవిశ్వాసం ప్రకటించగా సోమవారం జరిగిన అవిశ్వాసం వీగిపోయినట్లు ఆర్డీవో రమేష్ రాథోడ్ ప్రకటించారు. సోమవారం మద్నూర్ మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేయగా, సభ్యులెవ్వరూ హాజరు కాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు ఆర్డీవో ప్రకటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా, ఎంపీపీగా గెలిచిన లక్ష్మీబాయి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరడంతో అవిశ్వాసానికి సభ్యులు హాజరు కాకపోవడంతో ఎంపీపీ సభ్యుల నుంచి విశ్వాసం నెగ్గినట్లు తెలుస్తోంది.



సమావేశానికి హాజరుకాని సభ్యులు



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా పార్వతీ సిద్ధరామేశ్వర స్వామి కల్యాణం

● ఆలయంలో ప్రత్యేక పూజలు ● అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు ● ఆలయ ప్రాంగణంలో అగ్ని గుండాలు

భిక్కనూరు, ఏప్రిల్1: భిక్కనూరు మండల కేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న శ్రీసిద్ధరామేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణాన్ని సోమవారం అంగరంగ వైవభంగా నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అగ్నిగుండాలు, శ్రీ సిద్ధగిరి సమాధి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను డోలు సన్నాయిల మధ్య ఉత్సవ విగ్రహాలను ఊరేగించి ఆలయ ప్రాంగణంలో తీరొక్క పూలతో ఏర్పాటుచేసిన ముత్యాల పందిరిలో వేద బ్రహ్మణుల మంత్రోచ్ఛరణల నడుమ శ్రీ పార్వతీ సిద్ధరామేశ్వర స్వామి వారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా మెదక్, సిద్దిపేట, నిజామాబాద్ జిల్లాల నుండి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం భక్తులు స్వామివారికి ఒడి బియ్యం పోసి, కట్నకానుకలు చెల్లించి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి కల్యాణం సందర్భంగా ఆలయ నలుమూలలు శివనామస్మరణతో మార్మోగాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా, బ్రహ్మోత్సవాల్లో బాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. మేడ్చల్ జిల్లాకేంద్రానికి చెందిన నాగభూషణం వేసవికాలం దృష్ట్యా భక్తులకు మజ్జిగ పంపిణీ చేయ్యగా ఆలయ పరిసరాలలో పెద్దఎత్తున వివిధ రకాల దుకాణాలు వెలిశాయి.

నెమ్లి సాయి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పోచారం

నసురుల్లాబాద్, ఏప్రిల్ 1: మండలంలోని నెమ్లి సాయిబాబా ఆలయంలో సోమవారం ఆలయ ధర్మకర్త పటోళ్ల మోహన్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఆలయ ప్రయాణంలోని పంచముఖ, శివలింగాన్ని ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాయిబాబా ఆలయంలో శివలింగాన్ని ప్రతిష్ఠాపన చేసిన సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పటోళ్ల మోహన్‌రెడ్డి దంపతులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అనంతరం ఆలయంలో ప్రత్యేకపూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా మన బాన్సువాడ నియోజకవర్గంలో నెమ్లి గ్రామంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో, శివాలయాన్ని ఏర్పాటు చేయడంతో భక్తులకు ప్రత్యేక దైవ దర్శనం లభించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పటోళ్ల మోహన్‌రెడ్డి, దంపతులు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, గ్రామపెద్దలు, వివిధ గ్రామాల భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

రాజంపేట, ఏప్రిల్1: మండలంలోని మూడుగ్రామాల్లో సోమవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు సీఈవో సాయిలు తెలిపారు. ఆర్గోండ సొసైటీ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపల్లి, గుండారం, సిద్దాపూర్ గ్రామాలలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని దళారులను నమ్మిమోసపోవద్దని రైతులకు తెలియజేశారు. క్వింటా వరి ధాన్యానికి రూ.2203 ధర నిర్ణయించబడిందని తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీటీ శ్రీనివాస్, ఏఈవో మౌనిక రైతులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

ఇసుక రవాణాను అడ్డుకుంటే.. ఇళ్ల నిర్మాణాలు చేపట్టేదెలా?

బీర్కూర్, ఏప్రిల్ 1: మూడు నెలలుగా ఇసుక కొరతతో ఇళ్ల నిర్మాణాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని, ఇసుక రవాణాను అడ్డుకుంటే నిర్మాణాలు చేపట్టేది ఎలా అని కాంగ్రెస్ పార్టీ నాయకులు తహసీల్దార్ లతను ప్రశ్నించారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. ఇసుక రవాణాను అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక కొరతతో ఇళ్ల నిర్మాణాలు, ప్రభుత్వ, ప్రైవేట్ నిర్మాణ పనులు నిలిచిపోయాయని అన్నారు. రెండు రోజుల క్రితం ఇసుక తరలింపునకు అధికారులు మౌలిక ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు బీర్కూర్ మంజీరా నది నుంచి ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తూ లబ్ధిదారులకు అందజేస్తున్నారు. ఇదిలా ఉండగా సోమవారం కొంత మంది ఆర్డీవోకు ఇసుక రవాణాపై ఫిర్యాదు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎస్సై, తహసీల్దార్లు ఇసుక రవాణాను అడ్డుకున్నారు. ఈ విషయమై కాంగ్రెస్ పార్టీ నాయకులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఇసుక రవాణా ఎందుకు అడ్డుకున్నారని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. ఇసుక రవాణా అడ్డుకుంటే ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం ఎలా అని అడిగారు. ఉన్నతాధికారుల నుంచి ఆర్డర్ తీసుకువస్తే ఇసుక తరలింపునకు అనుమతిస్తామని తహసీల్దార్ కాంగ్రెస్ నాయకులకు తేల్చి చెప్పారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు బస్వరాజు, శంకర్, కమలాకర్‌రెడ్డి, ఇక్బాల్, కృష్ణారెడ్డి ఉన్నారు.



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నిజాంసాగర్: మండలంలోని బంజాపల్లి గ్రామంలో బొమ్మగాళ్ల శాస్త్రి అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ ఇసుక తరలిస్తుండటంతో పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలించవద్దన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

మొక్కల నిర్వహణపై నిర్లక్ష్యం తగదు

నిజాంసాగర్, ఏప్రిల్1: గ్రామాల్లో హరితహారం నర్సరీల్లో మొక్కల పెంపకం పట్ల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్ష్యం వహించవద్దని ఎంపీడీవో గంగాధర్ సూచించారు. మండలంలోని కొమలంచ గ్రామంలో నర్సరీని పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో పర్యటించి పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా తీరును పరిశీలించారు. ఇంటి పన్నులు ఎంత మేర వసూలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నర్సరీలో పదివేల మొక్కలను సిద్ధం చేసే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. మొక్కలు ఎండి పోకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రవీందర్ తదితరులున్నారు.

'పోరాట ఫలితంగానే బిల్లుల చెల్లింపు'

బాన్సువాడటౌన్, ఏప్రిల్ 1: బాన్సువాడ ఏరియాప్వత్రి, ఎంసీహెచ్‌లలో పనిచేస్తున్న కార్మికుల పోరాటం ఫలితంగానే ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు 5 నెలల బకాయి బిల్లులు చెల్లించడం జరిగిందని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్‌రాములు అన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని ఎంసీహెచ్ ఆస్పత్రిలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని ఆస్పత్రి కార్మికులు బకాయి వేతనాల కోసం నిరసనలు చేపట్టారన్నారు. కార్మికుల పోరాటం ఫలితంగానే ప్రభుత్వం సదరు కాంట్రాక్టర్‌కు బకాయి బిల్లులు చెల్లించినట్లు తెలిపారు. కాంట్రాక్టర్ తక్షణమే స్పందించి ఆస్పత్రి కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంతోష్‌గౌడ్, రేణుక, క్రమోద్దీన్, సంగీత, సుశీల, గంగాధర్, కళ్యాణి, రాములు ఉన్నారు.



పోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

రాజస్థాన్ మార్వాడీల శీతల్ కార్యక్రమం

మద్నూర్, ఏప్రిల్ 1: మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయంలో సోమవారం మార్వాడీ సమాజ్ మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి యేడాది హోలీ పండుగ తర్వాత శీతల్ ఉత్సవాన్ని రాజస్థానీ సమాజ్ మహిళలు నిర్వహిస్తారు. అందులో భాగంగా సోమ వారం గ్రామ దేవత, పోచమ్మ ఆలయానికి కుటుంబ సమేతంగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

బాన్సువాడటౌన్, ఏప్రిల్ 1: బాన్సువాడ అంబేద్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘ పెద్దలు తెలిపారు. నూతన అధ్యక్షుడిగా దొన్కంటి అంజనేయులు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా చింతల గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా నక్క సుధీర్‌కుమార్, కోశాధికారిగా వినోద్‌కుమార్, ఉపాధ్యక్షులుగా సాయిలు, విజయ్‌లతో పాటు సలహాదారులను కగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు సుదర్శన్ ప్రసాద్, కౌన్సిలర్ వెంకటేశ్, విఠల్, మల్లూరి సాయిలు తదితరలున్నారు.

'హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి'

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 1: ఈనెల 7వ తేదీన 6,7,10వ తరగతుల్లో మోడల్ స్కూళ్లలో ప్రవేశాల కోసం నిర్వహించబోయే ప్రవేశ పరీక్షకు సంబంధించిన హాల్‌టిక్కెట్లు తెలంగాణ.సిజిజి.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని వాటిని డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షకు హాజరుకావాలని నిజామాబాద్ డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. వివరాలకు ఆర్మూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ 93912 66444 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.



పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే మదన్ మోహన్

కాంగ్రెస్‌లోకి సహకార సంఘం ఉపాధ్యక్షుడు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 1: ఎల్లారెడ్డి సహకార సంఘం ఉపాధ్యక్షుడు మత్తమాల ప్రశాంత్‌గౌడ్ సోమవారం హైదరాబాద్‌లోని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ నాయకులు సాయిరాంగౌడ్, అనిల్ నాయక్, మరో ఇద్దరు నాయకులు చేరారు. ఈ కార్యక్రమంలో నాగం సాయిబాబా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరతున్నట్లు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత



విరాళాన్ని అందజేస్తున్న గోపాల్ చారీ

నిజాంసాగర్, ఏప్రిల్ 1: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ నిర్మాణం కోసం తన వంతుగా నిజాంసాగర్‌కు చెందిన ట్రాన్స్‌కో ఉద్యోగి గోపాల్ చారీ రూ.25 వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణం కోసం దాతలు తమ వంతుగా విరాళాన్ని అందజేస్తున్నారన్నారు. దీంతో ఆలయ నిర్మాణ పనులు చురుకుగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు గ్రామస్థులు రాములు, రాజు, నరేష్ తదితరులున్నారు.

బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరి మృతి

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 1: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్ఐ బొజ్జ మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మం డలంలోని తిమ్మారెడ్డి గేట్ సమీపంలో మూలమలుపు వద్ద ఆదివారం రాత్రి తిమ్మారెడ్డి గ్రామానికి చెందిన చిలుక సత్యనారాయణ (46) అతని కొడుకు మధు నిజాంసాగర్ నుంచి ఎల్లారెడ్డికి వస్తుండగా, హైదరాబాద్ నుంచి బోధన్ ఆర్టీసీ బస్సు బోధన్ వైపు వెళుతుండగా ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి గేట్ సమీపంలో మూలమలుపు వద్ద ఢీకొనడంతో సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుమారుడు మధుకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన చట్ట రీత్యా నేరం

నిజాంసాగర్, ఏప్రిల్ 1 : ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కోడ్ ఉందని ఎవరైనా కోడ్ ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఫ్లయింగ్ స్క్వాడ్ టీం సభ్యులు హెచ్చరించారు. నిజాంసాగర్, పిట్లం మండలాలకు చెందిన ఫ్లయింగ్ స్క్వాడ్ నెంబర్ సభ్యులు ఎఎస్సై రాజేశ్వర్, సీనియర్ అసిస్టెంట్ శ్రావణ్ కుమార్, కానిస్టేబుల్ విజయ్‌లు సోమవారం మండలంలోని తున్కిపల్లి, గాలిపూర్ గ్రామాల్లో మైకు ద్వారా ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో గ్రామాలల్లో మద్యం విక్రయాలు చేయకూడదని, అనవసరమైన విషయాలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అల్లర్లు సృష్టించరాదన్నారు.

కన్నుల పండువగా సీతారాముల కల్యాణం

మాచారెడ్డి, ఏప్రిల్ 1: మండలంలోని అక్కాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. మూడురోజులపాటు సాగిన ఈ మహోత్సవం కన్నుల పండుగగా సాగింది. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి మాదవనంద పీఠాధిపతి స్వామిజీ పాల్గొని భక్తులకు ప్రవచనాలు వినిపించారు. అనంతరం మహిళలు సీతారాములకు ఒడి బియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయమంతా శ్రీరామ నామస్మరణతో మార్మోగింది. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు.



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

ప్రియా 35 - ఓం భీం బుష్
దర్శన్ - రజాకర్, ఆడుజీవితం
శాంతి - ప్రేమలు
ప్రియా 70 - గాడ్జిల్లా ఎక్స్‌కింగ్, ది న్యూ ఎంపైర్

బాన్సువాడ

వెంకటేశ్వర - గోట్ లైఫ్
మహేశ్వరి - టిల్లు స్క్వేర్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	200	220
వెన్‌కాబ్(కిలో)	:	120	210	230

